# పరిశుద్ధ ప్రదేశములపై నిలిచియుండుట

### (2 సమూ. 6; 7; 1 దినవృ. 13; 15-17; 22; 28)

మోషే మండుచున్న పొదను సమీపించబోయినప్పుడు, "దగ్గరకు రావద్దు, నీ పాదములనుండి నీ చెప్పులు విడువుము, నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము" అని దేవుడు పలికాడు (నిర్గమ. 3:5). దేవుని ఆరాధించడానికి వచ్చి, ఆయన పరిశుద్ధ సన్నిధిలో నేడు నిలిచి ఉన్నప్పుడు మనం పరిశుద్ధ ప్రదేశంలో నిలిచినవారమై ఉంటాం. దానిని మనం గుర్తిస్తామా లేక ఏ భక్తి భావం లేకుండానే దేవుని సముఖానికి వస్తామా? మన ఆరాధన సామాన్యమయ్యిందిగా మారిపోయిందా?

దేవుడు ఎవరు? ఆయన ఏమైయున్నాడు? అనేదానికి యిచ్చే ప్రత్యుత్తరంలో ప్రధాన మైనదియు, మొదటిదియునైనది ఆరాధన. అది విధింపబడిన చర్యలను జరిగించు కార్యమైయుంది; దేవుని వ్యక్తిత్వాన్ని, బలాన్ని, సర్వశక్తిని గుర్తించడమైయుంది. ఆరాధనలో మార్పును గూర్చి మనం ఎక్కువగా వింటూ ఉంటాం. మార్పు అవసరమే – మన ఆరాధనా కార్యక్రమాలను జరిగించే విధానంలో కాదు, గాని మన హృదయాలలో మార్పు అవసరం! మనం లోతులేని జనంగా మారిపోయాం. దేవునియందలి భక్తి విషయంలో నామమాత్రపు భక్తిగలవారమయ్యేలా మనలను లేపి, ఆత్మ సంబంధంగా ఉల్లాసింపజేసే, పరిశుద్ధమైన ప్రదేశంలో నిలిచియున్నట్టు గుర్తించగల అవసరత మనకు మరోసారి ఉంది!

2 సమూ. 6; 7ల్లోను (దానికి సంబంధించిన 1 దినవృత్తాంతాలలోను) దేవుని సన్నిధికి చేరుకొనడం అంటే భావమేమో స్పష్టంగా గుర్తు చేసే సూచనలున్నాయి. దేవుని హృదయానుసారుడైన దావీదు ఆ సంగతులను జ్ఞాపకం చేసుకోవలసి ఉంటాడు. అలాగే మనం కూడా తృప్తిచెందునట్లుగా అతడు కార్యాలను చేసాడు.

అతడింకను ముప్పది సంవత్సరాల ప్రాయంలోనే ఉండగా అతడు దేశాన్ని ఏకం చేశాడు, యెరూషలేమును తన రాజధాని నగరంగా స్థిరపరచుకొన్నాడు, అతడు న్యాయమైన, పక్షపాతంలేని ఏకచక్రాధిపతిగా ప్రదర్శించుకున్నాడు. దావీదుకు అది కేవలం ఆరంభం మాత్రమే. ఉత్తర దక్షిణ భాగాలను అతడు ఏకం చేశాడు. ఇప్పుడు అతడు దేవునీ, ప్రజలనూ ఏకం చేయబూనాడు. రాజైన దావీదు ఆలోచనలు ఎంత ఉత్తమమైనవైనా, మన అందరివలననే, ఆరాధన విషయంలో అతడెంతో నేర్చుకొన వలసినవాడై యున్నాడు.

రెండవ సమూయేలు 6; 7లు, మరియు మొదటి దినవృత్తాంతములు 13-17ల గుండా వెళ్లి, "పరిశుద్ధ ప్రదేశంపై నిలిచియుండడం" అంటే ఏమో మనం తిలకించుదాం.

## ఆరాధన వేళాకోళముకాని పనియై ఉంది
## (2 సమూ. 6:1-11; 1 దినవృ. 13:1-14)

దావీదు యెరూషలేమును పట్టుకున్న తరువాత, యెహోవా నిబంధన మందసాన్ని మొదటిగా అతడు యెరూషలేమునకు తరలించ తీర్మానించుకొన్నట్టు మొదటి దినవృత్తాంతముల రచయిత తెలియజేస్తున్నాడు. యెరూషలేమును "దావీదు పట్టణంగా" మాత్రమేగాక అది దేవుని పట్టణంగాను తీర్చి దిద్దాలని – దేశమందు దేవుని ప్రధానమైన స్థానంలో నిలపాలనేది అతని ప్రధాన లక్ష్యంగా గోచరిస్తుంది.

"ఈ యోచన మీ దృష్టికి అనుకూలమై మన దేవుడైన యెహోవావలన కలిగిన యెడల … మన దేవుని మందసమును మరల మనయొద్దకు కొనివత్తము రండి; సౌలు దినములలో దానియొద్ద మనము విచారణ చేయకయే యుంటిమి" అని సమాజముగా కూడిన ఇశ్రాయేలీయులందరితో దావీదు అన్నాడు (1 దినవృ. 13:2, 3). "మన దేవుని మందసము" అనే ప్రయోగం యిక్కడనే తొలిసారిగా చదవడంవలన, దీనికి సంబంధించిన కొంత పూర్వ చరిత్ర అవసరంగా కన్పిస్తుంది.

మోషే సీనాయి పర్వతం మీద పది ఆజ్ఞలు పొందుతున్న సమయంలో, పవిత్రమైన ఆరాధనా స్థలంగా ఉండడానికిగాను ప్రత్యక్ష గుడార నిర్మాణాన్ని గూర్చిన ఆజ్ఞలను అతడు దేవునివలన పొందాడు. ఈ గుడారంలో ఉంచబడే వస్తువులలో నిబంధన మందసం అనేది ఒకటి. మందసం అనేది చిన్నగా ఉండే బంగారుతో పొదిగింపబడిన ఒక పెట్టె. ఈ మందసంలో మూడు వస్తువులు ఉంటాయి: పది ఆజ్ఞలుగల రెండు రాతి పలకలు, మన్నాగల బంగారు పాత్ర, మరియు చిగురించిన అహరోను యొక్క చేతికర్ర. ఆ పెట్టెయొక్క మూతకూడా బంగారుతో చేయబడినదై యుండి "కరుణాపీఠమని" పిలువబడుతుంది.[1] ఆ మూతమీద రెండు కెరూబుల[2] బొమ్మలు ఒకదానికొకటి ఎదురుగా రెక్కలు చాపబడినట్టును కరుణాపీఠంవైపు చూస్తున్నట్టును చేయబడి ఉంటాయి. ఈ మందసాన్ని గూర్చిన మరొక వివరణ చెప్పాలి: ఆ మందసానికి యిరువైపుల బంగారు ఉంగరము చేయబడి, ఆ ఉంగరాలలో బంగారుతో తాపబడిన కర్రలు దూర్చబడి ఉంటాయి. ఆ మందసాన్ని ఒక చోటునుండి మరో చోటుకి తరలించడానికి అవి మోత కర్రలుగా ఉంటాయి.[3]

ప్రత్యక్ష గుడారము పని ముగిసిన తరువాత అతి పరిశుద్ధ స్థలంలో నిబంధన మందసము పెట్టబడింది. ప్రాయశ్చితార్థ దినమున, సంవత్సరానికి ఒక్కసారి ప్రధాన యాజకుడు మాత్రమే అతి పరిశుద్ధ స్థలంలోనికి ప్రవేశిస్తాడు.[4] మిగిలిన వారెవ్వరు మందసాన్ని చూచే అవకాశమే ఉండదు. ప్రధానయాజకుడు సహితము దాన్ని ముట్టకూడదు. ప్రత్యక్ష గుడారం కదిలింపబడాలంటే కహాతు కుమారులు (లేవీ గోత్రికులు) తమ భుజముల మీద మోత కర్రలతో దాన్ని మోయాలి.[5] సంఖ్యా. 4:15ను గమనించు:

> దండు ప్రయాణమైనప్పుడు అహరోనును అతని కుమారులును పరిశుద్ధ స్థలమును పరిశుద్ధ స్థలముయొక్క ఉపకరణములన్నిటిని కప్పుట ముగించిన తరువాత కహాతీయులు దాని మోయ రావలెను. అయితే వారు చావకయుండునట్లు పరిశుద్ధమైన దానిని ముట్టకూడదు …

అదే అధ్యాయంలో 20వ వచనాన్ని కూడా గమనించు: “వారు **చావకయుండునట్లు** పరిశుద్ధ స్థలమును రెప్పపాటు సేపైనను చూచుటకు లోపలికి రాకూడదు” “చావకయుండు నట్లు” అనే మాటలను నీ మనస్సులో ఉంచుకో. ప్రత్యక్ష గుడారంలో ఉంచబడిన పవిత్రమైన ఆ మందసం “పరిశుద్ధ ప్రదేశం” అనే దానికి కేంద్ర స్థానమై ఉంటుంది. అందులో అతి పరిశుద్ధమైనది నిబంధన మందసమే.

దురదృష్టవశాత్తు, కాలం గడిచేకొద్దీ, పరిశుద్ధ స్థలంతో నిరంతరం ఉండే సంబంధంతో అది సామాన్యమైనట్టు భావించబడింది. ఆరాధనలో మనకును అట్టి పరిస్థితియే సంభవించవచ్చు. నిబంధన మందసం విషయంలో ఇశ్రాయేలీయులకు అలా సంభవించింది.

ఇశ్రాయేలీయులు కనాను దేశానికి చేరినప్పుడు, ప్రత్యక్ష గుడారం షిలోహులో ఉంచబడింది. ఒక రోజున, ఇశ్రాయేలీయుల సైన్యం నిబంధన మందసం కొరకు వెదకుతూ వచ్చింది (1 సమూ. 4:4). ఫిలిష్తీయులతో యుద్ధమందు వారిలో నాల్గు వేలమంది కూలిపోయారు (1 సమూ. 4:2). మందసాన్ని, “పెట్టిలో – ఉన్న దేవుని” అన్నట్లు వారికి మేలు కలుగుతుందనే ఉద్దేశంతో యుద్ధ భూమిలోనికి దాన్ని తీసికొని వెళ్లాలని తీర్మానించారు. అపవిత్రమైన వారి ఉద్దేశానికి దేవుడు ఆనందించలేదు. తరువాత యుద్ధంలో ముప్పై నాలుగువేలమంది ఇశ్రాయేలీయులు మరణించారు, మందసం ఫిలిష్తీయుల చేతుల్లో చిక్కుబడింది (1 సమూ. 4:10, 11).

ఏడు మాసాలపాటు ఫిలిష్తీయులతో ఉన్న మందసం బాధలు తప్ప మరేమియు వారికి తేలేదు. వారి విగ్రహాలు విరిగాయి, ఎలుకలచేత బాధ కలిగింది, పుండ్లు కలిగి బాధించాయి.[6] క్రొత్త బండిలో మందసాన్ని దేశం నుంచి పంపివేయవలసిందిగా ఇంద్రజాల నాయకులు వారికి సలహానిచ్చారు. (“క్రొత్త బండి”[7] అనే పద ప్రయోగాన్ని గుర్తించు; 1 సమూ. 6:7, 8).

బేత్షెమెషువరకు ఆవులు ఆ బండిని లాగుకొని వచ్చాయి. యూదాకు సరిహద్దుగా ఉన్న ఇశ్రాయేలీయుల పట్టణమది.[8] మందసాన్ని చూచి ఇశ్రాయేలీయులు ఆనందించారు – అయితే భక్తి మర్యాదలుగాని, పరిశుద్ధ ప్రదేశమందు నిలిచిన భావనను గాని వారు దానియెడల ప్రదర్శింపలేదు. వారు ఆ మందసం చుట్టు పోగయ్యారు. లోపల ఏముందో చూడడానికి వారు కృపాసనాన్ని తెరచి చూచారు. వెంటనే వారు దెబ్బతో మొత్తబడి చనిపోయారు![9] (1 సమూ. 6:19). భయాందోళన చెందిన బేత్షెమెషు ప్రజలు మందసాన్ని కిర్యత్యారీము పట్టణానికి పదిహేను మైళ్ల దూరంలోనికి పంపివేశారు. అబీనాదాబు అనే ఒకని యింట అది చేర్చబడింది (1 సమూ. 7:1).

సమూయేలు పరిచర్యలోని చివరి భాగంలోను, సౌలు పరిపాలనా కాలంలోను, దావీదు పరిపాలనలోని తొలి భాగంలోను మందసం అక్కడనే నిలిచిపోయింది. అక్కడ దాదాపు డెబ్బై సంవత్సరాలు,[10] దుమ్ము కొట్టుకొనిపోయినట్టుంది. “దేవుని మందసాన్ని మరల మన యొద్దకు కొనివత్తము రండి, సౌలు దినములలో దానివద్ద మనము విచారణ చేయకయే ఉంటిమి” అని దావీదు ప్రజలతో చెప్పిననాడు మందసం పరిస్థితి అది.

> తరువాత దావీదు ఇశ్రాయేలీయులలో ముప్పదివేలమంది శూరులను సమకూర్చుకొని బయలుదేరి, కెరూబుల మధ్య నివసించు సైన్యములకధిపతియగు యెహోవా అను తన నామము పెట్టబడిన దేవుని మందసమును అచ్చటనుండి తీసికొని వచ్చుటకై తన యొద్దనున్న వారందరితో కూడ బయిలా[11] యెహూదాలోనుండి ప్రయాణమాయెను (2 సమూ. 6:1, 2).

ఏదియెలాగున్నా, మనకు ఆశ్చర్యం కలిగించేలా, 2 సమూ. 6:3 యొక్క తొలి భాగంలో యిలా చదువుతాం: "వారు దేవుని మందసమును క్రొత్త బండి మీద ఎక్కించి గిబియాలోనున్న అబీనాదాబు యింటిలోనుండి తీసికొనిరాగా ..." "క్రొత్త బండి మీదనా?" వారు మందసాన్ని క్రొత్త బండి మీద ఎందుకు పెట్టారు?[12] ఇశ్రాయేలు దేశంలోనికి మందసం ఆ విధంగా వచ్చినట్టు ఎవరైనా రిపోర్టు యిచ్చారా?[13] దావీదును, అందులో జోక్యంగలవారును తమ బాధ్యతను గుర్తించడం మరిచారు. ఆ మందసాన్ని కహాతు కుమారులు దాని మోత కర్రలతో కొనిపోవాలి అనే సంగతి వారు మరచి ఉండాలి, లేక దాని ప్రాముఖ్యతను వారు గుర్తించక పోయియైనా ఉండాలి. అయితే దాని ఫలితాలు ఘోరమైనవి.

ఆ కథను చదవడంలో మనం ముందుకు సాగుతుండగా, "అబీనాదాబు కుమారులకు ఉజ్జాయును అహ్యోయును ఆ క్రొత్త బండిని తోలిరి"[14] అని రాయబడింది (2 సమూ. 6:3బి).

> దేవుని మందసముగల ఆ బండిని గిబియాలోని అబీనాదాబు యింటనుండి తీసికొనిరాగా అహ్యో దానిముందర నడిచెను. దావీదును ఇశ్రాయేలీయులందరును సరళవృక్షపు కఱ్ఱతో చేయబడిన నానావిధములైన సితారాలను స్వరమండలములను తంబురలను మృదంగములను పెద్ద తాళములను వాయించుచు యెహోవా సన్నిధిని నాట్య మాడుచుండిరి (2 సమూ. 6:4, 5).

ఆ దృశ్యాన్ని నీ మనస్సులోనికి తెచ్చుకో. రెండు చక్రాల బండి.[15] ఆ బండిమీద మందసం. ఆ బండిని రెండు గిత్తలు లాగుతున్నాయి. అహ్యో బండికి ముందర నడవడం ద్వారా ఆ ఎడ్లకు త్రోవ చూపడం; ఉజ్జా బండి ప్రక్కనే నడుస్తూ, సమస్తం చక్కగా ఉండేలా చూడడం. దావీదును, దావీదుతో కూడ ముప్పది వేలమంది ఆ బండిచుట్టు వాద్యములు వాయిస్తూ, నాట్యమాడుతూ పాడుతూ కేకలు వేస్తూ సాగిపోతున్నారు. అది బహు బ్రహ్మాండమైన ఉత్సవం! తప్పో ఒప్పో, దేవుడు ఆనందించి తీరాలి అన్నట్టుంది!

తటాలున, ఉత్సవం ఆగిపోయింది. ఆ ఊరేగింపు కీదోను[16] కళ్లమువద్దకు రాగా ఎడ్లకు కాలు జారింది. బండి ఒరిగి మందసం పడిపోయేలా ఉంది. ఉద్వేగంతో,

> ఉజ్జా చేయి చాపి దేవుని మందసమును పట్టుకొనగా యెహోవా కోపము ఉజ్జా మీద రగులుకొనెను. అతడు చేసిన తప్పునుబట్టి దేవుడు ఆ క్షణమందే అతని మొత్తగా అతడు అక్కడనే దేవుని మందసమునొద్ద పడి చనిపోయెను (2 సమూ. 6:6, 7).

ఆ సంఘటనను యింతకుముందు ఎన్నడూ వినని కాలేజీ విద్యార్థులకు ఇటీవల

చెప్పినప్పుడు, వారు దిగ్భ్రమచెందారు. "అతడు కేవలం ఆ మందసాన్ని కాపాడాలని, అది పడిపోకుండా ఉంచాలనే గదా అతడు ప్రయత్నించాడు!"[17] అలాటప్పుడు "దేవుడు ఉజ్జాను ఎందుకు చంపాడో" వారు తెలిసికోగోరారు. అప్పటికప్పుడే న్యాయసమ్మతంగా దేవుడు కనపరచే కోపానికి దిగ్భ్రమ చెందేవారిలో నా విద్యార్థులే మొదటివారో కడపటివారో కాకపోవచ్చు. ఏదియెలాగున్నా, సంఖ్యాకాండంలో దేవుడు ఏమని చెప్పాడు? కహాతు కుమారులు బంగారు మోత కర్రలతో దాన్ని మోయాలి అని చెప్పాడు. అయితే "వారు చావక యుండునట్లు పరిశుద్ధమైన దానిని ముట్టకూడదు" (సంఖ్యా. 4:15).

ఉజ్జా మనస్తత్వం మనకున్నందున ఉజ్జా కథవలన మనం దిగ్భ్రమచెందుతాం. దేవుని సేవించడంలో మన మంచి ఉద్దేశాలు సరిపోతాయి, మనం నిష్కపటంగా ఉన్నంతవరకు మనం ఏమి చేసినా దేవుడు అంగీకరిస్తాడని మనం ఊహిస్తాం. యథార్థత లేనట్టుగాని, దురుద్దేశం కలిగియున్నట్టుగాని ఎవడును ఉజ్జాను నిదించలేదు. అయినా అతడు అక్కడికక్కడే చంపబడ్డాడు.

దేవుని గూర్చిన స్పృహ కలిగియుండేలా దేశాన్ని దావీదు వెనుకకు నడిపిస్తున్నా ఈ ప్రత్యేకమైన గడియలలో, ఆరాధన అనేది మనకిష్టం వచ్చినట్టు పద్ధతులు మార్చుకునే ఆటకాదని గుర్తు చేయడానికి దేవుడైన యెహోవా స్పష్టమైన గురుతును వారికిచ్చాడు. ఆరాధన అనేది బహు తీక్షణమైన కార్యక్రమమనే సంగతిని వారికి (మనకును) ఆయన తెలియపరచగోరాడు. ఆయన సన్నిధానమునకు మన సొంత షరత్తులవలన రాకూడదన్న విషయాన్ని కఠినంగా తెలియజేశాడు. ఆయన షరత్తుల ప్రకారమే అది జరగాలని ఆయన గట్టిగా సూచించాడు. మనం ఆయన సన్నిధానానికి వచ్చి చేరినప్పుడు, భయముతో, వణకుతో వినయంతో ఉండవలసినవారమై యున్నాము.[18]

ఉజ్జా చనిపోయి అతని కాళ్లవద్ద పడగా, దావీదు మనస్సులో పలు విధములైన ఉద్వేగాలు కలిగాయి. మొదటిగా, "యెహోవా ఉజ్జాకు ప్రాణోపద్రవము కలుగజేయగా, దావీదు వ్యాకులపడ్డాడు" (2 సమూ. 6:8). దావీదు ఆరంభ ప్రతిచర్య కోపము, కలతయైయుంది. అయితే త్వరలోనే దావీదు భయముతో నిండాడు. "ఆ దినమున దావీదు యెహోవాకు భయపడ్డాడు" (2 సమూ. 6:9ఎ). దావీదు యెహోవాకు భయపడ్డాడని చదవడం యిదే మొదటిసారి. కడకు దావీదు అనిశ్చయితుడయ్యాడు: "యెహోవా మందసము నాయొద్ద ఏలాగుండుననుకొన్నాడు" (2 సమూ. 6:9బి). గనుక యెహోవా మందసాన్ని "దావీదు పురములోనికి తనయొద్దకు తెప్పింపనొల్లక, గిత్తీయుడగు[19] ఓబేదెదోము ఇంటివరకు తీసికొని అచ్చట ఉంచెను" (2 సమూ. 6:10). దావీదు తిరిగి యెరూషలేము వెళ్లిపోయాడు.

మనకు మనమే యథార్థవంతులమై ఉన్నట్టయితే, అది నిజంగా దేవుడు కోరిందియైనా కాకపోయినా, ఆయన మన ఆరాధనను దీవించాలని ఎదురు చూస్తూ, మన సొంత "క్రొత్త బండ్లను" తరచుగా మనం కట్టుతూ ఉంటామని అంగీకరించి తీరాలి. సమయం అవకాశమిచ్చియున్నట్టయితే, నేను దేవుని ఆరాధించడంలో మనుష్యులు నిర్మించిన సిద్ధాంతపరమైన "క్రొత్త బండ్లను" గూర్చి మనం మాట్లాడుకొని యుండేవారమే: ధూపం వేయడం, ప్రభువు భోజనానికి బదులుగా పూజ జరపడం, ప్రభురాత్రి భోజనం అనుకూల

సమయాల్లో చేయడం, స్త్రీలు ఆరాధనలో నాయకత్వం వహించడం, ఆరాధనలో వాయిద్యాలు[20] వగైరాలు[21] ఈ కోవకు చెందినవే.

ఏదియెలాగున్నా, ఈ సంగతిని వ్యక్తిగతంగాను, ఆచరణలోను[22] సాధ్యమైనంతవరకు తీసికొందాం. దావీదుగాని, ఆకానుగాని దేవుని తగినంత తీవ్రంగా ఆలోచించలేదు. ఈ విశ్వమంతటికి అధినేతయైనవానికి చూపవలసిన గౌరవ మర్యాదలు లేకపోయినట్టుగా క్రొత్త బండి ప్రాతినిధ్యమిస్తుంది. మర్యాదలేని అనేకములైన క్రొత్త బండ్లను మనలో అనేకులం కట్టిన మాట వాస్తవం కాదా? తరచుగా, దేవుని సన్నిధానానికి చేరడంలో మనం బహు సాధారణంగా ఉండిపోతాం. ప్రార్థించడంలో, పాడడంలో, దేవుని వాక్యాన్ని చదవడంలో, ప్రభురాత్రి భోజనాన్ని చేయడంలో మనం బహు అలక్ష్యంగా ఉండిపోతాం. పవిత్రమైన దానిగా ఎంచనందుకు ఉజ్జా తన భౌతిక జీవితాన్ని కోల్పోయాడు. దీన్ని సందేహింపకు; మనం మన ఆత్మ సంబంధమైన జీవితాలను కోల్పోవచ్చు.

> కాబట్టి యెవడు అయోగ్యముగా ప్రభువు యొక్క రొట్టెను తినునో, లేక ఆయన పాత్రలోనిది త్రాగునో, వాడు ప్రభువు యొక్క శరీరమును గూర్చియు రక్తమును గూర్చియు అపరాధియగును ... ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు. ఇందువలననే మీలో అనేకులు బలహీనులును రోగులునైయున్నారు; చాలమంది నిద్రించుచున్నారు (అంటే, చస్తున్నారు) (1 కొరింథీ. 11:27, 29, 30).

దేవుడు ఉజ్జాను చంపడంలో ఆశ్చర్యంలేదు; ఆశ్చర్యమేమంటే ఆయన మనలను చంపడంలేదు. ఆరాధన అనేది తీవ్రమైన విషయం.[23]

## వివరాల కొరకైన అక్కర ఆరాధనలోని ఆనందాన్ని తీసివేయదు
## (2 సమూ. 6:12-19; 1 దినవృ. 15:1-16:3, 7-36, 43)

"ధర్మశాస్త్ర" సంబంధమైన వివరాల విషయంలో అక్కర చూపడం మతపరంగా నిష్ఫలులవ్వడమేనని కొందరు భావిస్తారు. లేఖనాల్లో "సూక్ష్మమైన వాటిని" చూడగోరేవారిని వ్యతిరేకమైన మనోభావం కలిగిన వారినిగా లేఖనాలు బంధిస్తాయి. ఆనంద దాయకంగా ఆరాధించడం అంటే "ఉన్నపాటునే" బైబిల్లో కన్పించే వివరాలను లక్ష్యపెట్టినా, లక్ష్యపెట్టకపోయినా, చేయడమేనని వారి ఆలోచన. మందసాన్ని యెరూషలేమునకు తరలించే కథలో ఈలాటి తీర్మానం నిజంకాదని కనుపరచబడింది.

ఓబేదెదోము యింట దావీదు మందసాన్ని విడిచి వెళ్లి మూడు నెలలైయింది.[24] ఈ నెలలు దావీదుకు విరామం లేనివిగా ఉండిపోయాయి. తన రాజ నగరు కట్టడాన్ని ఆరంభించాడు, తన కుటుంబాన్ని చేరువకు తెచ్చుకున్నాడు; ఫిలిష్తీయులతో కొన్ని స్థిరమైన యుద్ధాలను జరిగించాడు.[25]

ఆ మూడు నెలల అంతమందు, "దేవుని మందసమును బట్టి" ఓబేదెదోము యిల్లు బహుగా ఆశీర్వదింపబడినట్టు ఎవరో ఒకడు దావీదుకు వర్తమానం తెచ్చాడు (2 సమూ.

6:12ఎ). ఆ సంగతిని, అదే కాలంలో తన జీవితం కూడా ఆశీర్వదించబడిన సంగతిని దావీదు ఆలోచింపగా, దేవుని కోపం చల్లారినట్లు దావీదు తీర్మానానికి వచ్చాడు. మందసాన్ని యెరూషలేమునకు తరలించడానికి అతడు మరోసారి ప్రయత్నించాడు.

అయితే, ఈసారి మాత్రం, అతడు తగిన ఏర్పాటును, సిద్ధపాటును గావించాడు. మొదటిగా, అతడు ఒక ప్రత్యేకమైన స్థలాన్ని సిద్ధపరచాడు: మందసం పట్టణానికి వచ్చి చేరుకున్నప్పుడు, యెరూషలేములో ఒక స్థలంలో గుడారం వేయించాడు.[26] రెండవది, అతి ప్రధానంగా, అతడు ప్రత్యేకమైన ప్రజలను ఏర్పాటు చేశాడు. దావీదు ఈసారి తన యింట చేయవలసిన పనిని శ్రద్ధగా చేశాడు. "తన వద్దనున్న ధర్మశాస్త్ర ప్రతిలో" మందసాన్ని గూర్చియు, దాన్ని తరలించడాన్ని గూర్చియు మోషే ఏమి తెలియజేశాడో శ్రద్ధగా పరికించాడు. నిర్గమ. 25, సంఖ్యా. 4, 7 మరియు ద్వితీయో. 10 అనే వాటిని అతడు శ్రద్ధగా కనుగొన్నాడు. లేఖనములలోని కహాతీయులు మోత కర్రలతో తమ భుజాల మీద దేవుని మందసాన్ని మోయాలన్న సంగతిని అతడు తెలిసుకున్నాడు. ఏమి చేయాలని దేవుడు ఆజ్ఞాపించాడో అలాగే చేయడానికి దావీదు తీర్మానించుకున్నాడు.

2 సమూ. 6:12లోని చివరి భాగం యిలా అంటుంది: "దావీదు పోయి దేవుని మందసమును ఓబేదెదోము ఇంటిలోనుండి దావీదు పురమునకు ఉత్సవముతో తీసికొని వచ్చెను." 1 దినవృ. 15 వివరాలను యిస్తుంది. "–మందసమును ఎత్తుటకును నిత్యము తనకు సేవచేయుటకును యెహోవా లేవీయులను ఏర్పరచుకొనెనని చెప్పి – వారు తప్ప మరి ఎవరును దేవుని మందసమును ఎత్తకూడదని దావీదు ఆజ్ఞ ఇచ్చెను" (2 వ.). దావీదు లేవీయులను యాజకులను సమకూర్చి వారి నాయకులకు యిలా ఆజ్ఞాపించాడు:

> –లేవీయుల పితరుల సంతతులకు మీరు పెద్దలైయున్నారు. ఇంతకుముందు మీరు ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా మందసమును మోయక యుండుటచేతను, మనము మన దేవుడైన యెహోవా యొద్ద విధినిబట్టి విచారణ చేయకుండుటచేతను, ఆయన మనలో నాశనము కలుగజేసెను; కావున ఇప్పుడు మీరును మీవారును మిమ్మును మీరు ప్రతిష్ఠించుకొని, నేను ఆ మందసమునకు సిద్ధపరచిన స్థలమునకు దాని తేవలెను (1 దినవృ 15:12, 13).

"చట్టమునను సరించి మనమాయనను వెదకలేదు" అనే విషయాలను గుర్తుంచుకో. మరోవిధంగా చెప్పాలంటే, "ప్రతి విషయంలో మనం దేవుని ఆజ్ఞలను అనుసరించినందున ఆయన మన ఆరాధనను ఆశీర్వదింపలేదు." దావీదు మాట్లాడిన "విధి" ఐదువందల సంవత్సరాలకు పూర్వము మోషేచే యివ్వబడింది. అయితే అది యివ్వబడిన దినాన ఎలా అమల్లో ఉందో, దావీదు నాటికి అది అలాగే అమలులో ఉంది. "మన కాలానికి అనుకూలంగా" దేవుని విధిని మార్చుకొనడానికి మనకు హక్కు ఉన్నట్టు కొందరు తలంచుతారు. తన విధులను మార్చడానికి దేవునికి మాత్రమే హక్కు ఉంటుందని దావీదును – అలాగే మనమును నేర్చుకొనవలసినవారమై ఉన్నాము.

లేఖనానుసారమైన ఆరాధనకు క్రొత్త నిబంధనలో రెండు సంగతులు అవసరమై యున్నట్టు ప్రభువైన యేసు తెలియజేశాడు. "దేవుడు ఆత్మ గనుక ఆయనను

ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను” అని ఆయన తెలియజేశాడు (యోహాను 4:24). మనం దేవుని వాక్య ప్రకారము ఆరాధించవలసినవారమైయున్నాం. (సత్యము, యోహాను 17:17), అలా చేయడానికి మనకు సరియైన స్వభావం ఉండాలి (ఆత్మ). ఆరాధన యొక్క ఆత్మ చాల ప్రాముఖ్యమైనది, కాని దేవుడు సూచించిన వివరాలు కూడా అంతే ముఖ్యమైనవి. మనం సరియైన సంగతులు సరియైన విధానంలో చేయవలసినవాళ్ళుగా ఉన్నాం.

క్రీస్తు సంఘముల ఆరాధన కార్యక్రమములను గూర్చి సత్యము అనేది అనేక వివరాలను తెలియజేస్తుంది. వారంలో ప్రతి మొదటి దినాన మాత్రమే ప్రభురాత్రి భోజనం మనకు ఎందుకు ఉండాలి? పురుషులు మాత్రమే ఎందుకు ప్రకటించాలి, నడిపించాలి? క్రొత్త నిబంధనలో అలాగే చేయవలెనని దేవుడు ఆజ్ఞాపించాడు గనుక. “అది అల్పం. అత్యల్పమైన విషయాలలో దేవుడు తప్పక అక్కర కలిగియుండడు” అని ఎవరైనా ఆక్షేపణ చెప్పవచ్చు. అయితే 2 సమూ. 6, 1 దినవృ 13–15లలోని కథ ప్రకారం, “బంగారు ఉంగరాలు, మోత కర్రలు, మందసాన్ని కప్పడం, ఎవరు మందసాన్ని మోయ వలసింది” – వంటి వివరాల విషయమై దేవుడు అక్కర కలిగియున్నట్టు తెలియవస్తుంది!

ఈ సమయంలో మనం అడిగే ప్రశ్న ఎలాగుంటుందంటే–“ఆరాధనలో యిట్టి వివరాలను నొక్కి చెప్పడం, ఆరాధనలోని సంతోషాన్ని తొలిగిస్తుందా?” ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి మన కథ ముగించనివ్వండి. సమస్తము సిద్ధంగా ఉన్నప్పుడు ...

> అప్పుడు యాజకులును లేవీయులును ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా మందసమును తెచ్చుటకై తమ్మును తాము ప్రతిష్ఠించుకొనిరి. తరువాత లేవీయులు యెహోవా సెలవిచ్చిన మాటనుబట్టి మోషే ఆజ్ఞాపించినట్లు దేవుని మందసమును దాని దండెలతో తమ భుజముల మీదికి ఎత్తుకొనిరి (1 దినవ. 15:14, 15).

2 సమూ. 6:13లో ఒక ఆకర్షణీయమైన వివరణ చేర్చబడింది: “ఎట్లనగా యెహోవా మందసమును మోయువారు ఆరేసి యడుగులు సాగగా ఎద్దు ఒకటియు క్రొవ్విన దూడ ఒకటియు వధింపబడెను ...” ఈ రెండవ ప్రయత్నం మొదటి ప్రయత్నంలా అంత మౌతుందో, లేక విజయవంతమౌతుందో ఎవరికీ తెలియదు. మందసం మోయడానికి నన్ను ఏర్పరచుకొనియుంటే, అది మోసయుక్తమైన గౌరవమని నేను తలంచియుండేవాడనే. “నేనా? ఉజ్జాను చంపిన పెట్టిని మోసికొని పోవడమా? నీవు తమాషాగా మాట్లాడు తున్నా”వని నేను అనియుండేవాడనే.

మందసం మోసుకొని పోతున్నవారి చెమటలు కారిపోవడం నీవు చూడలేవా? ఆ మోత కర్రలను తమ వ్రేళ్ల కొనలతో తాకి చూచి, వెనక్కి లాగుకున్నారు. ఏ విధమైన విపత్తు సంభవించలేదు. వారు మెల్ల మెల్లగా అడుగులు వేయ మొదలుపెట్టారు. మొదటి అడుగు, రెండవ అడుగు, అప్పుడు మూడవది ... నాల్గవది ... అయిదవది ... ఆరవ అడుగు వేశారు వారింకా ప్రాణాలతోనే ఉన్నారు! మెల్లగా వారు మందసాన్ని దించారు. ఊపిరి సలుపుకొని, చిరునవ్వులు వేయసాగారు. ఈసారి ఫరావాలేదు!

మందసాన్ని నిలపడానికి ఒకచోటు, దాన్ని మోయడానికి దావీదు మనుష్యులను

సిద్ధం చేసియుంచడం మాత్రమేగాక; దానికి సంబంధించిన బలులను సహా సిద్ధం చేసియుంచాడు. ఆ స్థలంలో “ఒక ఎద్దును, ఒక క్రొవ్విన దూడను” అతడు బలిగా అర్పించాడు (2 సమూ. 6:13; NIV). దావీదు అర్పణతోపాటు, లేవీయులు తమ గోత్రానికి యివ్వబడిన ప్రత్యేకతను గుర్తించినవారై ప్రత్యేకమైన బలి వారు కూడా అర్పించారు: దేవుడు వారితో ఉన్నట్టు తెలుపుకున్నారు. ఆ జాతీయ జీవితంలో వారికి కలిగిన నిజమైన స్థితికి లేవీయులు పునరుద్ధరించబడ్డారు. “యెహోవా నిబంధన మందసమును మోయు లేవీయులకు దేవుడు సహాయము చేయగా వారు ఏడు కోడెలను ఏడు గొఱ్ఱె పొట్టేళ్ళను బలులుగా అర్పించిరి” (1 దినవృ. 15:26).

ప్రతి విషయములో యిప్పుడు వారు తమ దేవునితోగల తమ బాంధవ్యాల్లో సరిగా ఉన్నారు. దేవుడు వారి హృదయాలలో మహిమపరచబడడం మాత్రమే గాక, ఆయన చిత్తాన్ని సంపూర్తిగా అనుసరిండంలోను ఆయనను మహిమపరచారు. దోషము, పశ్చాత్తాపము అనే అనుభవాల్లోనుండి దావీదు విడిచిపోయినట్టున్నాడు.

> దావీదు నారతో నేయబడిన ఏఫోదును ధరించినవాడై శక్తికొలది యెహోవా సన్నిధిని నాట్యమాడుచుండెను[27] (2 సమూ. 6:14).
>
> ఇశ్రాయేలీయులందరును ఆర్భాటము చేయుచు, కొమ్ములు బూరలు ఊదుచు, తాళములు కొట్టుచు, స్వరమండలములు సితారాలు వాయించుచు యెహోవా నిబంధన మందసమును తీసికొనివచ్చిరి (1 దినవృ. 15:28).

యెహోవా మందసము యెరూషలేమునకు వచ్చినప్పుడు ఎంత ఉల్లాసంగా ఉండి పోయిందో! ఇశ్రాయేలీయుల అసలైన రాజు ఎవరో జనులందరు తెలిసికోవాలని దావీదు కోరుకున్నాడు. దావీదు రాజ వస్త్రాలను ధరించినవాడో, లేక రాజు యొక్క హోదాలో నడిచినవాడో కాడు. దానికి బదులు, నారతో చేయబడిన ఏఫోదును ధరించి,[28] యెహోవాను స్తుతించుతూ మందసం ఎదుట నాట్యమాడాడు. యెరూషలేమును తన రాజధాని నగరంగా చేసికొన్నప్పుడు సైనిక విన్యాసమేదీ జరుగలేదు. అయితే యెహోవాకు విజయోత్సవం జరగాలనేది అతని వాంఛ!

దావీదు సిద్ధపరచిన గుడారమును వారు చేరినప్పుడు, మందసము భక్తి మర్యాదలతో అందులో ఉంచబడింది. తన కొరకును, తన ప్రజలందరి కొరకును దావీదు పాప పరిహారార్థ బలులను, సమాధాన [“సహవాసానికి సంబంధించిన”; NIV] బలులను అర్పించాడు. ఈ సందర్భానికి దేవునియొక్క శక్తి, ప్రభావము, ఘనత, మహిమను వర్ణించుతూ దావీదు ఒక కీర్తనను వ్రాశాడు.[29] చలింపజేసే ఈ కీర్తన– “ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యుగములన్నిటను స్తోత్రము నొందును గాక” అంటూ ముగించ బడుతుంది (1 దినవృ. 16:36ఎ వ.). “ఈలాగున వారు పాడగా జనులందరు ఆమెన్ అని చెప్పి యెహోవాను స్తుతించిరి” (36బి వ.). దావీదు తన చేతులెత్తి “జనులను ఆశీర్వదించెను” (2 సమూ. 6:18). సహవాసముగా కూడిన ఇశ్రాయేలీయులగు స్త్రీ పురుషులందరికి ఆహారమునకు పదార్థములనిచ్చిన తరువాత జనులందరు తమ తమ

యింధ్లకు వెళ్లిపోయారు. దేవుని గూర్చిన జ్ఞానము తిరిగి ఆయన ప్రజలకు కలిగింది.

ధర్మశాస్త్రాన్ని తూచా తప్పక అనుసరించినందున దావీదు యొక్క యితర ఆరాధకుల ఆనందానికి అంతరాయం కలిగిందా? వివరాలకు శ్రద్ధ చూపడంవలన ఆనందం నశించిపోలేదు. అది అధికమే చేయబడినట్టు 2 సమూ. 6, 1 దినవృ 15; 16లో మనం ఒప్పింపబడకపోము. దావీదు మందసాన్ని యెరూషలేము తరలించబోయిన ప్రతిసారి ఉత్సవం జరుపబడింది. "క్రమమైన పద్ధతిలో" జనులు యెహోవా దేవుని వెదకనందున మొదటి ఉత్సవం దుఃఖాంతమయ్యింది.[30] ఏమి చేయుమని దేవుడు వారికాజ్ఞాపించాడో అలాగే చేసినందున రెండవ ఉత్సవం ఆనందదాయకంగా ముగిసింది.

రూపానికి కనుపరచే అక్కర ఆచారంగా మారవచ్చుగాని, యిది సంభవింపనవసరం లేదు. దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించడానికి తమ్మును తాము అప్పగించు కున్నవారు, "వివరాల ప్రకారం" తూచా తప్పక జరిగించగోరితే అనుభవంలో ఆటంక పరచువారైయుండక, విడిపించువారై ఉంటారు. నీ ఆరాధన దేవునికి అంగీకారంగా ఉంటుందని నీవు నీ హృదయమందు ఎరిగి యున్నప్పుడు, హృదయ పూర్వకంగా నీవు దేవుని ఆరాధించడానికి స్వతంత్రుడుగా ఉంటావు!

## అర్థ సహితమైన ఆరాధనకు సిద్ధపాటు అవసరం

## (1 దినవృ. 15:2-24; 16:1-7, 37-42)

2 సమూ. 6 మరియు 1 దినవృ. 15; 16లను విడిచిపెట్టక మునుపు రెండు సత్యాలను నొక్కి చెప్పనిమ్ము. మొదటిది, ఒంటరిగా గాని, బహిరంగంగా గాని అర్థ సహితమైన ఆరాధన చేయడానికి హృదయము యొక్క మరియు జీవితం యొక్క సిద్ధపాటు అవసరం.

మందసం కొరకు ఒక స్థలాన్ని, మందసాన్ని తరలించడానికి ప్రజలను, బలికి సంబంధించిన ఏర్పాట్లను దావీదు ముందుగా సిద్ధపరచి ఉంచినట్టు గతంలో మనం గమనించాం. మొదటి దినవృత్తాంతములు 15:16-24 సిద్ధపాటును గూర్చి తెలియజేస్తుంది. ప్రత్యేకింపబడిన జనులు ప్రత్యేకమైన పనులకొరకు ఏర్పరచబడ్డారు. మన ఆరాధనా కార్యక్రమాలలో ఆయా భాగాలకు ఆయా వ్యక్తులను మనం ఏర్పరచు కొన్నట్టే. మందసాన్ని మోసేవారితో పాటు, పాడేవారు, వాయిద్యాలు వాయించే వారు, మందసంయొక్క భద్రత కొరకు ద్వారపాలకులు నియమించబడ్డారు. ప్రత్యేకంగా గుర్తించదగినది 22వ వచనం: "లేవీయులకధిపతియైన కెనన్యా మందసమును మోయుటయందు గట్టివాడైనందున అతడు మోత క్రమము నేర్పుటకై నియమింపబడెను." మనం ఆరాధనా కార్యక్రమాన్ని జరిగించేటప్పుడు, మనకు ఉన్నవారిలో శ్రేష్ఠమైనవారిని వినియోగించుకొందాం; ఆరాధన మన శ్రేష్ఠమైనవాటిని కోరుతుంది.

మందసం యెరూషలేములో పెట్టబడిన తరువాత, అనుదిన ఆరాధన కొరకు ఈసారి దావీదు తన సిద్ధపాట్లను కొనసాగిస్తునే ఉన్నట్టు మొదటి దినవృత్తాంతములు 16 అంటుంది. "మరియు అతడు యెహోవా మందసము ఎదుట సేవచేయుచు, ఇశ్రాయే

లీయుల దేవుడైన యెహోవాను ప్రసిద్ధి చేయుటకును, వందించుటకును ఆయనకు స్తోత్రములు చెల్లించుటకును లేవీయులలో కొందరిని నియమించెను" (4 వ.).[31]

"ఏది చేయతగిందో అది సరిగా చేయతగినదై యుంది" అని దావీదు చెప్తుతూ ఉండేవాడు. మన జీవితంలోని యితర చోట్ల ఈ సూత్రము నిజమేనని మనలో ఎక్కువ మంది అర్థం చేసికొంటారు. అయితే వింతేమంటే, దేవుని ఆరాధించడానికి వచ్చి, దాని విషయమై ఏ ఆలోచన చేయకున్నా, దేవుడు మనయందు ఆనందిస్తాడని మనం తలంచుతాం. శనివారం చాలా రాత్రివరకు మేలుకొనియుంటాం, ఆదివారం ఉదయం ఆలస్యంగా నిద్రలేస్తాం, ఆలస్యంగా ఆరాధనా స్థలానికి చేరుకొని–ఆరాధనలో "ఏదో పొందాలని" మనం ఆలోచిస్తూ ఉంటాం.

అర్థ సహితమైన ఆరాధన, చేయగోరితే, మనం సిద్ధపడాలి. కూడే స్థలమును సిద్ధపరచాలి. ప్రభువు బల్ల సిద్ధపరచాలి. పాటలు నడిపించేవారు, ప్రార్థనలు నడిపించేవారు సిద్ధపడాలి. ప్రసంగీకుడు సిద్ధపడాలి. బహిరంగ ఆరాధనా క్రమాన్ని గూర్చి పౌలు వ్రాసినప్పుడు: "సమస్తమును మర్యాదగాను క్రమముగాను జరుగనియ్యుడి" అని తెలియజేశాడు (1 కొరింథీ. 14:40).

అన్నిటికంటెను అతి ముఖ్యమైన విషయమేమంటే, ఆయనను ఆరాధించడానికి సంసిద్ధులై వారి వారి హృదయాలను జీవితాలను సిద్ధపరచుకుంటూ ప్రతి వ్యక్తి దేవుని సన్నిధానానికి రావాలి.

## ఆరాధనలో మనమేమీ పొందలేక పోయినట్లయితే, మన సొంత హృదయాలనే మనం పరీక్షించుకుందాం (2 సమూ. 6:16, 20-23; 1 దినవృ. 15:29; 16:43)

2 సమూ. 7కు వెళ్లకముందు, నేను నొక్కి చెప్పగోరిన రెండవ విషయమేమంటే: ఆరాధనలో మనమేమియు పొందలేక ఉన్నట్టయితే, మనం మన సొంత హృదయాలను పరీక్షించుకొనవలసినవారమైయున్నాం.

2 సమూ. 6:16లో మనం యిలా చదువుతాం: "యెహోవా మందసము దావీదు పురమునకు రాగా, సౌలు కుమార్తెయగు మీకాలు కిటికీలోనుండి చూచి, యెహోవా సన్నిధిని గంతులు వేయుచు నాట్యమాడుచునున్న దావీదును కనుగొని, తన మనస్సులో అతని హీనపరచెను." మీకాలు యొక్క విపత్కరమైన కథ నీకు జ్ఞాపకముంది. సౌలు ఆమెను దావీదునకిచ్చాడు; దావీదు పారిపోయినప్పుడు, సౌలు ఆమెను మరొకనికిచ్చి పెండ్లి చేశాడు. ఇశ్రాయేలీయులందరి మీద దావీదు రాజుగా చేయబడాలనే మంతనాలు అబ్నేరు జరిగించినప్పుడు, మీకాలు తిరిగి తనకు యిప్పింపబడవలసిందిగా దావీదు కోరాడు. తన రెండవ భర్తనుండి మీకాలు తీసికొనబడినప్పుడు, అతడు ఏడ్చుతూ ఆమె వెంట పరుగెత్తాడు. ఇంటికి తిరిగి వెళ్లునట్లు బలవంత పెట్టబడేవరకు అతడు అలా చేశాడు. ఇప్పుడు ఆనంద రహితమైన ఆ కథ ముగింపుకు వస్తుంది.

పట్టణపు గవినియొద్దకు మందసము రాగా, మీకాలు రాజ భవనపు కిటికీలో గుండా

చూచి అతనిని “తన హృదయములో తృణీకరించింది.” 1 సమూ. 18:20లో మనం యిలా చదువుతాం: “సౌలు కుమార్తెయైన మీకాలు దావీదును ప్రేమించెను.” సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రేమయొక్క జ్వాల ఆరిపోయింది; కేవలం జీవంలేని బొగ్గులు మిగిలిపోయాయి. “ఇప్పుడు ఆమె అతని తృణీకరిస్తుంది.”

ఉత్సవం ముగిసిన పిమ్మట దావీదు “తన యింటివారిని ఆశీర్వదించడానికి తిరిగి వచ్చాడు” (1 దినవృ. 16:43). ఆత్మ సంబంధంగాను ఉద్వేగంగాను అతడు హెచ్చు స్థాయిలో ఉన్నాడు; దానిని అతడు తన కుటుంబంతో పంచుకోవాలనుకున్నాడు. “అయితే దావీదు తన యింటివారిని ఆశీర్వదింపవచ్చినప్పుడు.”[32] కోపంతో నిండిన మీకాలును అతడు ద్వారమువద్ద కలుసుకుంటాడు. వ్యంగ్యం ఆమె పెదవుల మీద జారుతుండగా: “హీనస్థితిగల పనికత్తెలు చూచుచుండగా వ్యర్థుడొకడు తన బట్టలను విప్పివేసినట్టుగా ఇశ్రాయేలీయులకు రాజువైన నీవు నేడు బట్టలను తీసివేసి యెంత ఘనముగా కనబడితివని” మీకాలు దావీదును అపహాస్యం చేసింది (2 సమూ. 6:20). “బట్టలు విప్పివేసి కొనడం” అనగానే దావీదు తన దిసమొల సిగ్గును కనుపరచాడని అర్థం కాదు. (క్రింది వస్త్రముంది దానిపై అంగీ వేసికొన్నాడు)[33] “వ్యర్థుడొకడు” అనేది కీలకమైన ప్రయోగం మీకాలు దృష్టిలో దావీదు తనను తాను వ్యర్థునిగా చేసికొన్నాడు. తన్ను గొప్పవానిగా చేసిన విషయాలను ఆమె తృణీకరించింది: జనులతో దేవుని సంబంధమైన ఉత్సాహం విషయంలో తాను ఒకడనే భావాన్ని అతడు కనుపరచాడు.

దావీదు ముఖం చిన్నబోయింది; అతని ఉత్సాహం అంతరించింది. తనను కోరుకొని ఘనపరచింది దేవుడని, తన పూర్ణ హృదయంతో తాను ఆయనను సన్నుతిస్తానని, అది తన్ను వ్యర్థునిగా చేసినా వెనుకాడబోయేది లేదని అతడు జవాబిచ్చాడు. అందరియెదుట అతడు నిర్దోషియన్నట్టు దేవుడు కడకు, అతనిని నిలబెట్టాడు.

ఈ చిన్న దృశ్యాన్ని 2 సమూ. 6:22బి ముగించుతుంది: “ సౌలు కుమార్తె అయిన మీకాలుకు మరణాంతమువరకు పిల్లలు కలుగకుండెను”[34] ఇది, దేవుడామెను[35] గొడ్రాలుగా శపించినట్లు సూచిస్తుంది. దావీదు ఆమె భార్యభర్తలుగా ఎన్నడూ కలిసి ఉండలేదన్న విషయాన్ని సూచిస్తుంది. లేక ఈ రెండును సత్యం కావచ్చు.

బంధాలు ఎలా చెడిపోతాయో అనే విషయాన్ని గూర్చి ఈ కుటుంబ సంబంధమైన చిన్న డ్రామాను గూర్చి మనం ఎంతో ఎక్కువగా చెప్పవచ్చు. ప్రస్తుతానికి, ఆరాధన అనే అంశంతో ఆగిపోదాం. ఇశ్రాయేలీయుల చరిత్రలో మందసాన్ని యెరూషలేమునకు తరలించడం అనేది అతి గొప్ప సంఘటనైయుంది. ఆ ఊరేగింపును యెరూషలేమునకు ఆహ్వానించే జన సమూహంతో మీకాలు ఉండియుండవచ్చు. మీకాలు హృదయ స్థితినిబట్టి, బ్రహ్మాండమైన ఈ సందర్భం ప్రేమ రహితమయిందిగా ఆమెను నిలబెట్టింది. ఆమె చేసిన ఒకే ఒక ప్రతిచర్య విమర్శించడమే: “దావీదు నీవును వ్యర్థులలో ఒకడుగా నిలిచిపోయావా?” అనేదే ఆమె భావన!

ఆరాధనను విమర్శించడం లోపల జరిగే క్రీడా రంగంగా మారిపోయింది. “పాటలు నడిపించేవానికి 6, ప్రార్థనను నడిపించినవానికి 3, ప్రసంగించినవానికి 5 పాయింట్లు వేస్తున్నా, అయితే ఆరాధనా కార్యక్రమం అంతటి మీద మైనస్ 2”గా మిగిలిపోయిందంటూ

అలంకార రూపంగా చెప్పితే, మనం స్కోరు వేస్తూ ఉంటాం! ఆరాధన విషయంలో ఒక విధమైన భావం కలిగియుండవచ్చు. "నాకు కార్యక్రమం యిష్టంగా ఉంటే అది మంచిది; నాకు కార్యక్రమం నచ్చకపోతే అది చెడ్డది" అనేది కొందరి ఉద్దేశం కావచ్చు.

అయితే ఆరాధన దేవునికి మానవ హృదయము యొక్క ప్రత్యుత్తరమై ఉండాలని ముఖ్యంగా మనం ఎల్లవేళల గుర్తు చేయబడవలసినవారమైయున్నాం. ఆరాధనా కార్యక్రమంలోనుండి నేను "ఏదీ పొందలేకపోయినట్లయితే," ఆరాధనను ఏర్పాటు చేసి నడిపించినవారిది గాక, అది కేవలం నా హృదయ సమస్యయై యుండవచ్చు. విమర్శనా దృష్టితో ఆరాధనా కార్యక్రమానికి దూరంగా నిలిచియున్న మీకాలువలె ఉండకుండునట్లు దేవా మాకు సహాయము చేయుము.

## ఆరాధనలో, సదుద్దేశములు సరిపోవు

## (2 సమూ. 7:1-17; 1 దినవృ. 17:1-15)

2 సమూ. 7కు జరిగిపోతూ, "మనం ఆరాధనకు వచ్చినప్పుడు, సదుద్దేశములు మాత్రమే సరిపోవు" అనే ప్రాముఖ్యమైన పాఠాన్ని కనుగొంటాం.

2 సమూ. 6, 7ల మధ్య కాలంలో దావీదు తన యుద్ధాలు జరిగించడం, అతని ఇంటిని కట్టుకొనడం వంటి కార్యాలను ముగిస్తాడు.[36] ఒక రోజున దావీదు విశ్రమించి తన నూతన గృహాన్ని అతడు అనుభవిస్తున్నాడు. సంతృప్తితో తాను చుట్టు పారజూచాడు, "నేను దేవదారు మానుతో కట్టబడిన యింటిలో నివసిస్తుండగా యెహోవా మందసం గుడారంలో నిలిచియున్నదే" అనే అలోచన అతనికి తట్టింది! తన స్నేహితుడు, సహోదరుడు ప్రవక్తయునైన నాతానును దావీదు పిలిపించాడు.[37] తన ఆలోచనలను నాతానుకు తెలుపగా, "నాతాను – యెహోవా నీకు తోడుగానున్నాడు; నీకు తోచినదంతయు నెరవేర్చు మనెను" (2 సమూ. 7:3).

ఆ రాత్రి దేవుడు నాతానుకు ప్రత్యక్షమై, దావీదు ఆలోచనను ఆంగీకరించడంలో అతడు బహు తొందరపడినట్లు ఆయన అతనికి తెలియజేశాడు. వాళ్ళు మొదట దేవుడీ ఆలోచనను ఆమోదించాడా లేదా అన్నది తెలుసుకోవాలి. ఇక్కడ మనకు పాఠాలున్నాయి. మంచి స్నేహితులు మనలను తప్పు త్రోవలను పట్టించవచ్చుననేది మొదటి పాఠం. ఆత్మ సంబంధులుగా వారు పేరు పొందినా ఈ పని జరుగవచ్చు (నాతాను దేవుని ప్రవక్త). మన ఆలోచనలు ఎంత మంచివైనా, అవి దేవునిచే అంగీకరింపబడకపోవచ్చు. (ప్రస్తుతం మనం నొక్కి చెప్పే పాయింటు అదే).

ఆరాధనలో కొన్ని క్రొత్త సంగతులను ప్రవేశపెట్టాలని ఆలోచించడం ప్రజలకు అసాధారణమైన సంగతి ఏమీ కాదు. "యెహోవాను ఘనపరచడమే నా ఉద్దేశం గనుక, తప్పక ఆయన ఆనందిస్తాడు." ఏదియెలాగున్నా, దేవుడు దేనియందు ఆనందిస్తాడో ఎరగడానికి ఏకైక మార్గం, ఆయన తన వాక్యంలో ఏమి తెలిపాడో పఠించి చూడడమే. ఇది లేక అది ఆయనను ఆనందింపజేస్తుందని మనం యోచింపవచ్చు గాని, నేను మరలా అంటున్నా, దేవుడు దేనియందు ఆనందిస్తాడో ఎరగడానికి ఏకైక మార్గం, బైబిల్లో

దాన్ని చదివి చూడడమే.[38]

"ఈ కార్యక్రమం విషయంలో నిన్ను ప్రోత్సహించడం నాది తప్పైపోయింది" అని మరుసటి దినం నాతాను దావీదు వద్దకు వచ్చి అతనికి తెలియజేయడం నాతానుకు కష్టమైయుండవచ్చు. అయినా, నాతాను దేవుని ప్రవక్త – ప్రవక్త యొక్క పని వర్ణనలో కఠినమైన పనులే భాగమైయుంటాయి. అతడు దావీదు వద్దకు తిరిగి వచ్చి, దైవ సందేశాన్ని నమ్మకంగా అందించాడు. 5 నుండి 16 వచనాల మధ్యనుండే వర్తమానం రెండవ సమూయేలులో అతి ప్రాముఖ్యమైన వర్తమానమైయుంది. పాత నిబంధనలోని ప్రధానమైన లేఖన భాగాలలో అది ఒకటియై ఉంది.

"నా కొరకు యిల్లు కట్టుమని నేను నిన్ను అడుగలేదు. అది లేకుండా నేను బాగానే ఉన్నాను"[39] అన్నట్టు దేవుడు దావీదుకు చెప్పనారంభించినట్టున్నాడు. "నా నివాసమునకై యొక ఆలయము కట్టించుట నీచేతకాదు" అని ఆయన స్పష్టంగా తెలియజేశాడు (1 దినవృ. 17:4). మరో విధంగా చెప్పాలంటే, "నీ ఆలోచనలు మంచివే, అయితే నేను కోరేది అది కాదు."

పలుకారణాలను బట్టి దేవుడు దావీదు కలకు "వద్దు" అని చెప్పాడు. తరువాత దావీదు ఈ రిపోర్టు యిచ్చాడు:

> యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను–నీవు విస్తారముగా రక్తము ఒలికించి గొప్ప యుద్ధములు జరిగించినవాడవు, నీవు నా నామమునకు మందిరము కట్టించ కూడదు, నా సన్నిధిని నీవు విస్తారముగా రక్తము నేలమీదికి ఓడ్చితివి. నీకు పుట్టబోవు ఒక కుమారుడు సమాధానకర్తగా నుండును; చుట్టు ఉండు అతని శత్రువుల నందరిని నేను తోలివేసి అతనికి సమాధానము కలుగజేతును; అందువలన అతనికి సొలొమోను అను పేరు పెట్టబడును; అతని దినములలో ఇశ్రాయేలీయులకు సమాధానమును విశ్రాంతియు దయచేయుదును. అతడు నా నామమునకు ఒక మందిరమును కట్టించును, అతడు నాకు కుమారుడై యుండును, నేనతనికి తండ్రినై యుందును, ఇశ్రాయేలీయులమీద అతని రాజ్య సింహాసనమును నిత్యము స్థిరపరచుదును (1 దినవృ. 22:8–10).

దావీదు కొరకు దేవుడు వేరే ముఖ్యమైన కార్యాలను నియమించాడు: దావీదు సామ్రాజ్యాన్ని నిర్మించాలి,[40] మరియు అతడు తన కుటుంబాన్ని కట్టాలి. తరువాత తన కుమారుడైన సొలొమోనును ఆలయ నిర్మాత గావించాలి.

మన కలలకు దేవుడు "లేదు–వద్దు" అని అంటే కష్టంగా ఉండదా? మనం మన ప్లాన్లు వేసికొంటాం, మన ఉద్దేశాలు బహు ఉన్నతంగా కన్పిస్తాయి, దేవుడు అంగీకరించ కుండడానికి ఏ మార్గముండదని మనం భావిస్తాం అయితే ఆ ప్లాన్లు ఫలించవు. క్రైస్తవ జతను కనుగొని క్రైస్తవ గృహం కట్టాలని, ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను పిల్లలను పెంచాలని ఉండవచ్చు, లేదా మన జీవితాలతో ఏదో చేయాలని మనం కోరవచ్చు – అయితే దేవుడు దాని విషయంలో తల ఆడించకపోవచ్చు.[41] విఫలమైన నా కలలు నాకున్నాయి. నీకు కూడా అలాటివి ఉండవచ్చు.

దేవుడు "లేదు" – "కాదు" అని చెప్పినంత మాత్రాన ఆయన మనలను విడిచిపెట్టాడని

అర్థం కాదు. మన విన్నపాలను ఆయన కాదన్నా, ఆయన మనలను కాదనడు.[42] "నా నామఘనతకు ఒక మందిరము కట్టించుటకు నీవు తాత్పర్యము కలిగియున్నావు, ఆ తాత్పర్యము మంచిదే"నని దేవుడు దావీదుకు తెలియజేశాడు (1 రాజులు 8:18).

"వద్దు" అని దేవుడు తెలియజేసినప్పుడు, ఆయన మనస్సులో శ్రేష్ఠమైనదేదో ఉండియుంటుందని 2 సమూ. 7 మనకు బోధిస్తుంది. ఇశ్రాయేలీయుల కొరకు ఏమి చేయబోతున్నాడో దేవుడు దావీదుకు తెలియజేసిన పిమ్మట, ఆయన యిలా అన్నాడు: "... మరియు యెహోవానగు నేను నీకు తెలియజేయునదేమనగా – నేను నీకు సంతానము కలుగజేయుదును" (11 వ.) "నీవు నాకు మందిరం (దేవాలయం) కట్టించ కూడదు, అయితే నేను నీకు రాజ వంశాన్ని నిర్మిస్తాను" అన్నట్టు ఆయన తెలిపాడు. రెండవ సమూయేలు 7:11–16ను "భావోత్పత్తికి సంబంధించిన" పాత నిబంధన "శిఖరాగ్రమని" అంటారు. దేవుడు దావీదుకు రాజ వంశాన్ని నిర్మిస్తానని మాట యిచ్చిన తరువాత, ఆయన యింకను యిలా అన్నాడు:

> నీ దినములు సంపూర్ణములగునప్పుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములోనుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నా నామ ఘనతకొరకు ఒక మందిరమును కట్టించును; అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను; నేనతనికి తండ్రినై యుందును. అతడు నాకు కుమారుడైయుండును; అతడు పాపము చేసినయెడల నరుల దండముతోను మనుష్యులకు తగులు దెబ్బలతోను అతని శిక్షింతును గాని నిన్ను స్థాపించుటకై నేను కొట్టివేసిన సౌలునకు నా కృప దూరమైనట్లు అతనికి నా కృప దూరము చేయను. నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అనెను (2 సమూ. 7:12–16).

దావీదుకు రెండు వాగ్దానాలు చేయబడ్డాయి: (1) అతని కుమారుడు దేవాలయాన్ని నిర్మిస్తాడు, (2) అతని రాజ వంశము నిత్యము నిలుస్తుంది. వీటిలో మొదటిది సొలొమోనుకు చెందుతుందని దావీదుకు తెలుసు.[43] రెండవ వాగ్దానం యొక్క నెరవేర్పు సొలొమోను దినాలను దాటివెళ్లుతుంది. దావీదు వంశస్థులు యూదా సింహాసనముపై రాజ్య పాలనను కొనసాగిస్తారు. ఆ రాజులు ఎట్టివారైయుండాలో అలా ఉండక పోయినా, "దావీదును బట్టి" దేవుడు ఆ రాజ వంశాన్ని కొనసాగించనైయున్నాడు.[44] ఏదియెలాగున్నా, చివరికి దేవుని ఓరిమికి హద్దులు దాటిపోయాయి. దక్షిణ రాజ్యమైన యూదా బబులోను చెరకు కొనిపోబడింది. దావీదు సంతతివారిలో ఎవడును రాజ్య సింహాసనం మీద కూర్చుండలేదు. దావీదు సంతతిగా రానైయున్న ఒకని గూర్చి ప్రవక్తలు ప్రవచింపసాగారు. అతడు దావీదు సింహాసనముపై కూర్చుంటాడు:

> యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు– రాబోవు దినములలో నేను దావీదునకు నీతి చిగురును పుట్టించెదను; అతడు రాజై పరిపాలన చేయును, అతడు వివేకముగా నడుచుకొనుచు కార్యము జరిగించును, భూమిమీద నీతి న్యాయములను జరిగించును. అతని దినములలో యూదా రక్షణనొందును, ఇశ్రాయేలు నిర్భయముగా నివసించును, యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు (యిర్మీయా 23:5, 6).

"నీతిమంతుడైన యేసుక్రీస్తు" (1 యోహాను 2:1) ఈ ప్రవచనం యొక్క నెరవేర్పై యున్నాడు. మత్తయి ప్రకారమైన సువార్త యిలా ఆరంభమౌతుంది: "అబ్రాహాము కుమారుడగు **దావీదు కుమారుడైన** యేసు క్రీస్తు వంశావళి" (1వ వచనం; ఒత్తి పలకడం నాది).[45] దావీదు రాజుయొక్క సంతతిగా, ఎన్నటికిని లయముకాని ఆత్మ సంబంధమైన శాశ్వత రాజ్యాన్ని స్థాపించడానికి ప్రభువైన యేసు అవతరించాడు.[46] యేసు మృతులలో నుండి లేపబడిన తరువాత, పరలోకానికి తిరిగి ఆరోహణుడైనప్పుడు, ఆయన "దావీదు సింహాసనం మీద" కూర్చుండబెట్టబడ్డాడు.[47] ప్రభువైన యేసు అక్కడ ఉండి, తన రాజ్యమను సంఘాన్ని నేడు కూడా పరిపాలిస్తునే ఉన్నాడు.[48]

ఈ విధంగా, 2 సమూ. 7లోని ప్రవచనాలు కడపటికి, క్రీస్తునందు నెరవేర్చ బడియున్నట్టు హెబ్రీయుల రచయిత సూచించాడు. "–నీవు నా కుమారుడవు, నేను నేడు నిన్ను కనియున్నాను అనియు ... –నేను ఆయనకు తండ్రినైయుందును, ఆయన నాకు కుమారుడైయుండును అనియు ఆ దూతలలో ఎవనితోనైన ఎప్పుడైనను చెప్పెనా?" అని ఆ రచయిత అడుగుతున్నాడు (హెబ్రీ. 1:5). సందర్భంలో, "దేవదూతలలో ఆయన తన కుమారుడని ఎవనితోను అన్నట్టు చెప్పలేదు." అయితే ప్రభువైన యేసును గూర్చి ఆయన ఈ సమాచారం తెలియజేశాడు. సొలొమోనును యితర యూదా రాజులును తాత్కాలికమైనవారై యుండి 2 సమూ. 7 యొక్క తాత్కాలికమైన నెరవేర్పులై యున్నారు గాని, మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తే దాని అంతిమ నెరవేర్పైయున్నాడని దైవ ప్రేరేపితుడైన రచయిత స్థాపించాడు!

ఓ క్షణంసేపు ఆగి నేను చెప్పుతున్న దానిని చవిచూడు. రాయి, కఱ్ఱతో చేయబడిన క్షయమైన భవనాన్ని దావీదు ఏర్పాటు చేయదలచుకున్నాడు. యెరూషలేమునకు వచ్చేవారికి దీవెనకరంగా ఉండేలా అది ఉద్దేశింపబడింది. శతాబ్దాలు జరుగుతూ ఉండగా కోట్లకొలది మందిని ఆశీర్వదించే నిత్య రాజ్యాన్ని దేవుడు తన మనస్సులో ఉంచుకున్నాడు. మన కలలను దేవుడు "కాదు" అన్నప్పుడు కొన్ని సార్లు ఆయన మనం ఊహించిన దానికంటె అత్యధికమైన దాన్ని చేయనుద్దేశించి ఉంటాడు.

ఏదియెలాగున్నా, దావీదు తన ఏర్పాట్లను దేవునితో సంప్రదించకుండగనే చేశాడన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.[49] అతని ఉద్దేశాలు ఘనమైనవే; అతని వాంఛ దేవుని ఘనపరచాలనే. అయినా, తొలిగా అతడు మహోన్నతునితో సంప్రదించలేదు, పైగా దేవుడు అతని ఆలోచనలకు "అడ్డం" చెప్పాడు. "వారు దేవునియందు ఆసక్తిగలవారని వారినిగూర్చి సాక్ష్యమిచ్చు చున్నాను; అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు" అని అపొస్తలుడైన పౌలు తరువాత కాలంలో తెలియజేశాడు (రోమా 10:2). మన సదుద్దేశములన్నీ దేవుని వాక్యముచేత పరీక్షింపబడవలసి యుంటుంది. మనం ఆరాధనను గూర్చి మాట్లాడినా, ఆయన పరిచర్యలో మరి యింకా దేనిని గూర్చి మాట్లాడినా, కేవలం సదుద్దేశములే సరిపోవు.

## నిజమైన ఆరాధన దేవునికి అనుకూలమైన జీవితంనుండి కలుగుతుంది

## (2 సమూ. 7:18-29; 1 దినవృ. 17:16-27; 22; 28)

"దేవుని హృదయానుసారుడు" అని దావీదు పిలువబడిన దానికి ఒక కారణం, దేవుని గద్దింపులకు అతడు స్పందించిన విధానమే.

నేనే దావీదునైయుంటే, దేవాలయం నిర్మించడానికి నాకు అనుమతి లేదనే సందేశాన్ని నాతాను తెచ్చినప్పుడు, దేవునికి శ్రేష్ఠమైనది మనస్సులో ఉన్నా లక్ష్యముండేది కాదు. నేను దాదాపుగా రెండు సంగతులు జరిగించేవాడనే. మొదటిగా నేను ఒకటి రెండు వారాలు గడవనిచ్చేవాడనే. అయితే, దావీదు యొక్క ప్రత్యుత్తరాన్ని గమనించు: నాతాను దైవ సందేశాన్ని అందించిన తరువాత (2 సమూ. 7:17), "దావీదు రాజు లోపల ప్రవేశించి యెహోవా సన్నిధిని కూర్చుండి"[50] (18ఎ వ.) దావీదు మందసము కొరకై సిద్ధపరచిన దేరాలోనికి వెళ్లి యజమానుని ఎదుట దాసుడు కూర్చున్నట్టు అతడు కూర్చున్నాడు.

దానివెంట జరిగిన కదిలించే ప్రార్థనలో, దావీదు భక్తితోను, వినయంతోను, స్వార్థరహితంతోను చేశాడు. "నీ దాసుడు" అనే మాటను దావీదు పదిసార్లు వినియోగించాడు. దేవుడు తాను వాగ్దానం చేసినదంతయు నెరవేర్చువాడని, అన్నిటిలో ఆయన గొప్పతనం విదితమై యుంటుందని అతడు ప్రార్థించాడు. అతని ప్రార్థనలోనుండి ముఖ్యమైన విషయాలను గమనించు:

> – నా ప్రభువా యెహోవా, ఇంతగా నీవు నన్ను హెచ్చించుటకు నేనెంతటివాడను? నా కుటుంబము ఏ పాటిది? ఇంత హెచ్చుగా చేసినదంతయు నీ దృష్టికి కొంచెమై ... యెహోవా నా ప్రభువా, నీ దాసుడనైన నన్ను నీవు ఎరిగియున్నావు ... కాబట్టి దేవా యెహోవా, నీవు అత్యంతమైన ఘనతగలవాడవు, నీవంటి దేవుడొకడును లేడు; ... నీవు తప్ప దేవుడెవడును లేడు. ... నీవు దేవుడవు గనుక నీ మాట సత్యము (నమ్మదగినది NIV). దయచేసి నీ దాసుడనైన నా కుటుంబము నిత్యము నీ సన్నిధిని ఉండునట్లుగా దానిని ఆశీర్వదించుము ... (2 సమూ. 7:18, 20, 22, 28, 29).

రెండవది, నేనే దావీదునై ఉన్నట్టయితే, "నన్ను దేవాలయం కట్టనియ్యకుంటే, సమస్త విషయములలో నేను నా చేతులు కడుగుకుంటానని అని ఉండేవాడనే. అది సొలొమోను యొక్క తలనొప్పి!" అయితే, దావీదు తన మిగిలిన కాలమంతా ఆలయ సంబంధమైన వాటిని సిద్ధపరచుటలో గడిపినట్టున్నాడు.

> ... దేవుని మందిరమును కట్టించుటకై రాళ్లు చెక్కువారిని నియమించెను. వాకిళ్ల తలుపులకు కావలసిన మేకులకేమి చీలలకేమి విస్తారమైన యినుమును తూచ శక్యము కానంత విస్తారమైన ఇత్తడిని ఎంచనలవికానన్ని దేవదారు మ్రానులను దావీదు సంపాదించెను. ... నా కుమారుడైన సొలొమోను పిన్న వయస్సుగల లేతవాడు; యెహోవాకు కట్టబోవు మందిరము దాని కీర్తినిబట్టియు అందమునుబట్టియు సకల దేశములలో ప్రసిద్ధి చెందునట్లుగా అది చాలా ఘనమైనదై యుండవలెను; కాగా

దానికి కావలసిన సాధన రాశిని సిద్ధపరచెదనని చెప్పి, దావీదు తన మరణమునకు ముందు విస్తారముగా వస్తువులను సమకూర్చి యుంచెను (1 దినవృ. 22:2–5).

దేవుడు దావీదును ఆశీర్వదించి, తన పరిశుద్ధతను పంపి దేవాలయానికి కావలసిన నమూనాను ఆత్మ ప్రేరేపణతో అతనికనుగ్రహించాడు.[51] చివరిగా, దావీదు సొలొమోనును తనవద్దకు పిలిపించి, "–ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు ఒక మందిరమును కట్టవలసినదని అతనికి ఆజ్ఞ ఇచ్చెను" (1 దినవృ. 22:6). అతడు తన కుమారునితో యిలా అన్నాడు:

ఇదిగో నేను నా కష్టస్థితిలోనే ప్రయాసపడి యెహోవా మందిరముకొరకు రెండు లక్షల మణుగుల బంగారమును పదికోట్ల మణుగుల వెండిని తూచ శక్యము కానంత విస్తారమైన యిత్తడిని యినుమును సమకూర్చియున్నాను; మ్రానులను రాళ్లను కూర్చియుంచితిని; నీవు ఇంకను సంపాదించుదువుగాక ... లెక్కింపలేనంత బంగారమును వెండియు ఇత్తడియు ఇనుమును నీకు ఉన్నవి; కాబట్టి నీవు పని పూనుకొనుము, యెహోవా నీకు తోడుగా ఉండును గాక (1 దినవృ. 22:14–16).

దేవాలయం యొక్క ఖరీదు వర్ణనాతీతం. అది కోట్ల కోట్ల రూపాయలు ఖరీదుగా దాన్ని లెక్కింపవచ్చు!

అప్పుడు దావీదు మంటపమునకును మందిరపు కట్టడమునకును ... కరుణా పీఠపు గదికిని యెహోవా మందిరపు ఆవరణములకును వాటి చుట్టునున్న గదులకును దేవుని మందిరపు బొక్కసములకును ప్రతిష్ఠిత వస్తువుల బొక్కసములకును తాను ఏర్పాటు చేసి సిద్ధపరచిన మచ్చులను తన కుమారుడైన సొలొమోనుకు అప్పగించెను. ఇవియన్నియు అప్పగించి – యెహోవా హస్తము నామీదికి వచ్చి యీ మచ్చుల పనియంతయు వ్రాత మూలముగా నాకు నేర్పెను అని సొలొమోనుతో చెప్పెను (1 దినవృ. 28:11, 12, 19).

దేవాలయము యొక్క వివరాలంతను దావీదు తానుగా తయారు చేయలేదు. తాను సొలొమోనుకు అప్పగించిన మచ్చులు దైవ ప్రేరేపణవలన వచ్చాయి.

దేవుని సందేశానికి దావీదు యొక్క ప్రతిచర్యను దయచేసి గుర్తించు: అతడు తన సొంత కోర్కెలను ప్రక్కనుంచి, దేవుని చిత్తానికి అతడు తన్ను తాను లోబరచుకున్నాడు – ఇదంతా సద్భావనతో అతడు జగిరించాడు! దేవునికి సన్నిహితంగా చేరడమే దావీదు యొక్క వాంఛయై యుంది. ఆరాధన అంతా దానికి సంబంధించిందే. సరియైన స్వభావంతో మనం దేవుని ఆరాధించినట్లయితే, తరువాత మన హృదయాలు, జీవితాలు ఆయన చిత్తానికి అనుగుణ్యంగా మారిపోతాయి.

## ముగింపు

యెషయా, దేవుడైన యెహోవా దర్శనం చేసికొన్నప్పుడు ఆయన "అత్యున్నతమైన సింహాసనం మీద ఆసీనుడైయుండగా," అతడు యిలా అన్నాడు:

–అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను; అపవిత్రమైన పెదవులుగల జనుల మధ్యను నివసించువాడను; నేను నశించితిని; రాజును సైన్యముల కధిపతియునగు యెహోవాను నేను కన్నులారా చూచితిననుకొంటిని (యెషయా 6:5).

మనం దేవుని సముఖంలో ఉన్నామని నేడు గ్రహించగలిగినా, మనం పరిశుద్ధ ప్రదేశం మీద నిలిచియున్నామని గ్రహించినా, మన ఆరాధనలో ఎంతో ఎక్కువ వ్యత్యాస ముంటుంది!

ఆరాధన ప్రాముఖ్యతతో మనం ఒప్పింపబడ్డామని నేను నిరీక్షిస్తున్నాను – అది ఒంటరిగానైనా, దేవుని ప్రజలతో కలిసి బహిరంగంగా జరిగే ఆరాధనా కార్యక్రమం లోనైన యిది నిజమైయుంటుంది. ఆరాధన మన భక్తికి హృదయమై ఉంది. అది మన జీవితములో కేంద్ర స్థానమైయుంది.

మన సమస్య ఏమంటే, ఆరాధనను మనం మన జీవితాల్లోనికి అమర్చుకోవాలి: ఒక గంట యిక్కడ, కొద్ది నిమిషాలు అక్కడ. దావీదు ఆరాధనను తన జీవితంలోనికి యిముడ్చుకోలేదు. అతని జీవితం ఆరాధన చుట్టు కేంద్రీకరింపబడియుంది–యెహోవాను స్తుతించడం ఘనపరచడంతోనే కూడియుంది. దేవునితో అతని బాంధవ్యం చెడిపోయి నప్పుడు, అతనికి అది తెలిసిపోయింది – అతని జీవితపు ప్రకాశం అంతరించింది. మరోవైపు, మనం ఆరాధనకు సమయం తీసికొన్నప్పుడు కొంత సందు ఏర్పడుతుంది, అది త్వరలో బాగుపడుతుంది.

“దేవా, తమరు పొందవలసిన గౌరవాన్ని భక్తిని కనుపరచడంలో మాటి మాటికి తప్పిపోయిన దౌర్భాగ్యులం. ఆరాధనలో లోపాలు గలవారమైయున్నా, తమరు ఎందుకు మమ్ములను ఓర్చుకుంటున్నారో ఎరుగకున్నాం, అయితే తమరు అలా చేస్తున్నందుకు కృతజ్ఞత గలవారమైయున్నాం. ఇప్పుడు మీ ప్రసన్నతను మేము అనుభవించగలుగునట్లు మాకు సహాయం చేయండి. తమరు మాకు సమీపంగా ఉన్నట్టును–మేము దీన స్వభావాన్ని ధరించుకొని తమవలె ఉండగలుగునట్టును సహాయపడండి. తమరి హృదయానికి అనుకూలంగా మా హృదయాలు యుండునట్లు మాకు సహాయం చేయండి. యేసు నామంలో, ఆమెన్.”

---

## ప్రసంగము - దృశ్య సహాయాలు

**ప్రసంగపు నోట్సు:** 2 సమూ. 6; 7 దావీదు జీవితంలో ఉన్నత స్థాయిని సూచిస్తున్నాయి. ఈ లేఖన భాగాల మీద అనేకమైన శక్తివంతమైన పాఠాలను ఆధారం చేసికోవచ్చు.

“క్రొత్త బండ్లు” అనే దానిమీద అనేకమైన గొప్ప ప్రసంగాలను చేయవచ్చు– 2 సమూ. 6; 1 దినవృ. 13; 15. రెండురకాలైన “క్రొత్తబండ్లు” ఈ పాఠంలో ప్రస్తావించ బడ్డాయి: సిద్ధాంతపరమైన తప్పులు అనే క్రొత్త బండ్లు మరియు భక్తి భావనలేని క్రొత్త బండ్లు. మూడవది కూడా చేర్చవచ్చు: లోక సంబంధమైన పద్ధతులు అనే క్రొత్త బండ్లు. రక్షించుటకు దేవుని శక్తియైయున్న సువార్తపై ఆధారపడే దానికి బదులు (రోమా 1:16), మానవ

జ్ఞానము, మానవ పద్ధతులు అనేవాటికి తిరిగి పోవచ్చు.

2 సమూ. 6 మీద ఆరాధనను గూర్చిన ఆచరణతో కూడిన ప్రసంగాన్ని చేయవచ్చు. ఈ పాఠం చెప్పే సమయంలో, ప్రభురాత్రి భోజనంలో పాలుపొందడంలో ఉండే తీవ్రతను గూర్చి నొక్కి చెప్పు ("పరిశుద్ధమైన దానిని అపవిత్రము చేయవద్దు" [లేవీయ. 22:15]).

1 దినవృ. 15:8–36లో దాఖలు చేయబడిన కీర్తన ప్రత్యేకమైన సంయుక్త పఠనమై యుంటుంది. దీన్ని కీర్తన. 105, 106తో జతచేసి చదువవచ్చు.

"సంతోషకరమైన వివాహ బంధాన్ని ఎలా పాడు చేసికోవచ్చో" దావీదు మీకాలు కథను ఆధారంగా చేసికొని బలమైన ప్రసంగాన్ని చేయవచ్చు.

"వద్దు అని దేవుడు చెప్పినప్పుడు" అంటూ 2 సమూయేలు 7ను ఆధారం చేసికొని పాఠం ఒకటి ఉపదేశింపవచ్చు.

2 సమూయేలు యొక్క సంగ్రహం కీర్తన. 132, దావీదుతో చేయబడిన నిబంధనకు సంబంధించినది కీర్తన. 89, 2 సమూ. 7తో సంబంధం కలిగియుంది.

2 సమూ. 7తో దేవుడు దావీదుకు యిచ్చిన వాగ్దానాలను గూర్చి విశ్వాసాన్ని బలపరచే పాఠాలను కట్టవచ్చు. మన జీవితాలను మన నిత్యత్వాన్ని పాత నిబంధన లేఖన భాగాలు ఎలా ప్రభావితం చేస్తాయో గుర్తించు. Henry H. Halley యొక్క 2 సమూ. 7 మీద నోట్సు మంచి మూలమైయుంటుంది. (*Bible Handbook* [Chicago, Ill.; Henry H. Halley, 1955], 174).

**దృశ్య – సహాయముల నోట్సు:** మందసం యొక్క సంపూర్ణమైన మోడల్ అతి శ్రేష్ఠమైన విజువల్ ఎయిడ్స్ అయ్యుంటుంది. బైబిలు క్లాసు టీచర్స్ మందసము యొక్క మోడల్‌ను వ్యక్తిగతంగా చేస్తేనే బాగుంటుంది. ఆ మాదిరిని చేతబట్టుకొనే అవకాశము అందరికి లేకపోవచ్చు. రమారమి ప్రత్యక్ష గుడారాన్ని చేయడానికి అట్టపెట్టిని ఉపయోగించు కుంటారు. శ్రోతలైనవారికి మందసం అనే భావన కలగడానికి హేతువయ్యింది.

---

సూచనలు

[1]నిర్గమ. 25:22ను గమనించు. [2]"కెరూబు" అనేదానికి "కెరూబులు" అనేది బహువచనం. దేవదూతలకు వీరు అలంకారపు ప్రతినిధులై యుండవచ్చు. [3]నిర్గమ. 25:12–15. [4]తన పాపములకొరకును ప్రజల పాపముల కొరకును ప్రధానయాజకుడు రక్తమును కరుణా పీఠం మీద చిలకరిస్తాడు లేక ప్రోక్షిస్తాడు. [5]సంఖ్యా. 7:9; ద్వితీయో. 10:8ని కూడ చూడు. [6]"గడ్డల రోగము" (1 సమూ. 5:6; వగైరాలు). [7]1 సమూ. 6:7. [8]యెహోషువ 21:16 [9]మరణించినవారి సంఖ్య 50, 070గా KJV మరియు NASB లో ఉంది. NIV, NEBల్లో 70 అనే ఉంది. [10]1 సమూ. 7:2లోని 20 సంవత్సరాలు కిర్యాత్యారీములో మందసం ఉంచి, 3వ వచనంలో సమూయేలు ఇశ్రాయేలీయులతో మాట్లాడిన మధ్య కాలమై యుండవచ్చు. సమూయేలు పరిచర్యలోని 20 సంవత్సరములు; సౌలు పరిపాలనలోని 40 సంవత్సరములు, దావీదు పాలనలోని 10 సంవత్సరములు మొత్తం డెబ్భై సంవత్సరములు కనీసమైయుండవచ్చు.

[11]యెహోషువ 15:9. [12]"క్రొత్త బండి" ప్రత్యేకించి ఆ సందర్భం కొరకు నిర్మింపబడినదై యుండవచ్చు. అది బహు సుందరంగా నిర్మింపబడిన బండియై ఉండవచ్చు. అయితే అది దేవుడు సూచించినది కాదు. [13]ప్రత్యక్ష గుడారములోని

యితర భాగాలను తరలించడానికి బండ్లను ఉపయోగించారా? (సంఖ్యా. 7:3-8). [14]1 దినవృ. 13:7లో వారు బండిని "తోలిరి" అని ఉంది. [15]రెండు చక్రాల బండి, రెండు ఎద్దులు దాన్ని లాగడం. [16]"నాకోను" సీదోను అనే రెండు ఒక్కటే. 1 దినవృ. 13:9; 2 సమూ. 6:6 "కళ్లమువద్దకు వచ్చినప్పుడు." [17]వారు మందసమును సరిగా తరలించుతున్నారో లేదో జ్ఞాపకముంచుకొని యున్నట్టయితే అపాయం సంభవించియుండేది కాదు. [18]ఆ చోటికి "పెరెజ్ ఉజ్జా" అని పేరు పెట్టబడింది (2 సమూ. 6:8). అది త్వరగా మరచిపోని దేవుని హెచ్చరిక. [19]"గిత్తీయులు" అంటే "గాతు స్థానికులని" అర్థం. (2 సమూ. 15:18ని గమనించు), అది ఫిలిష్తీయుల పట్టణం కాకపోవచ్చు. పలు ఇశ్రాయేలీయుల పట్టణాలకు "గాతు" అనేది ఉంటుంది (యెహోషువ 21:20-25); అతడు వాటిలో ఒకదాని వాడు కావచ్చు. "ఓబేదెదోము" తరువాత లేవీయులలో ఒకడుగా ప్రస్తావించబడ్డాడు (1 దినవృ. 15:18; వగైరాలు). [20]మనం చదువుతున్న కథలో దావీదు వాయిద్యాలను వాయిస్తున్నాడు. అయితే అది పాత నిబంధన ఆరాధన. సంఘం స్థాపింపబడినప్పుడు అలాటి వాయిద్య సంగీతంతో పాటు జంతు బలులు, ధూపం వేయడం, వగైరాలతో రద్దుచేయబడింది.

[21]మత్తయి 15:9లో ప్రభువైన యేసు యొక్క ప్రతిపాదనను గమనించు. [22]ఈ పాఠం వ్యక్తిగతమైన, అనుదిన జీవితానికి సంబంధించినది, బాధాకరమైనది కావచ్చు! [23]సామె. 1:7; హబక్కూకు 2:20. [24]2 సమూ. 6:11 [25]1 దినవృ. 14తో పోల్చి చూడు. [26]1 దినవృ. 15:1, 3, 12; 2 సమూ. 6:17లను కూడా చూడు. ప్రత్యక్ష గుడారంలోని అతి పరిశుద్ధమైన స్థలంలో కాకుండ దావీదు మందసాన్ని ఒక చోట ఎందుకు పెట్టాడు? ఇక్కడ కొన్ని ఆలోచనలున్నాయి: (1) మందసం పలుచోట్ల పెట్టబడినప్పుడు ఆ స్థలాలు దీవించబడ్డాయి. (2) ప్రత్యక్ష గుడారంలోని ఆయా భాగాలు చెల్లాచెదురుగా ఉన్నట్టున్నాయి. వాటిని ఏకంగా సమకూర్చడానికి యిది తొలి మెట్టు అయ్యుండవచ్చు. (3) మనకు చెప్పబడని ప్రత్యక్షత దావీదుకు కలిగియుండవచ్చు. [27]"నాట్యమాడుట"గా తర్జుమా చేయబడిన హెబ్రీ పదం యిక్కడే కన్పిస్తుంది (2 సమూ. 6:14, 16). వేగముగా తిరుగుట అనేది అక్షరార్థంగా "చుట్టు తిరుగుట." [28]1 దినవృ. 15:27; 2 సమూ. 6:14ను కూడా చూడు. ఏఫోదు అంటే చేతులు లేని బిగువుగా ఉండే చొక్కా. అలాటిది యాజకులు వేసికుంటారు (1 దినవృ. 15:27); అది రాజ వస్త్రం కాదు, సేవకులు కూడా వేసికొంటారు. [29]1 దినవృ. 16:8-36. 16:8-22తోను కీర్తన. 105:1-15తోను పోల్చి చూడు. 16:23-33లను కీర్తన. 96తోను పోల్చి చూడు. 16:34-36ను కీర్తన. 106:1, 47, 48తో పోల్చి చూడు. [30]1 దినవృ. 15:13; KJV.

[31]ప్రత్యక్ష గుడారమును దహన బలి పీఠమును తాత్కాలికంగా గిబియాలో ఉంచబడ్డాయి. స్థిరమైన స్థలం వాటికొరకు కట్టబడేవరకు అది జరిగింది. అక్కడ సేవలు జరిగించడానికి దావీదు యితరులను నియమించాడు (1 దినవృ. 16:39నుండి). దేవాలయం పూర్తికాగానే ప్రత్యక్ష గుడారమును మందసమును అందులోనికి తరలింపబడ్డాయి (1 రాజులు 8:4; 2 దినవృ. 5:5). [32]2 సమూ. 6:20ఎ. [33]దావీదు తన దిసమొల సిగ్గును కనుపరచాడా లేదా అనే విషయంలో వ్యాఖ్యాన కర్తలకు ఏకాభిప్రాయం లేదు, నేనైతే కనుపరచలేదంటాను. [34]ఇక మీదట ఆమెకు పిల్లలు కలుగరు అని అర్థంకావచ్చు-అయితే ఆమెకు పిల్లలు లేకపోవచ్చు 2 సమూ. 21:8; KJV, NKJVయింకా యితర తర్జుమాలలో మీకాలుకు పలువురు పిల్లలున్నట్టుంది. సెప్టూజంట్‌లోను యితర హెబ్రీ చేతి ప్రతులలోను మీకాలుకు బదులు "మేరబు" అని ఉంది. ఎక్కువ ప్రాచీన తర్జుమాలు దీనిని సూచిస్తున్నాయి. [35]పాత నిబంధన కాలంలో పిల్లలు లేకుండడం గొప్ప శాపంగా భావింపబడేది (1 సమూ. 1:5, 6 గమనించు). [36]8వ అధ్యాయంలో సంక్షిప్తం చేయబడిన కొన్ని యుద్ధాలు 6, 7 అధ్యాయాలకు మధ్య కాలంలో జరిగించినవై యుండవచ్చు. అందువలన 2 సమూ. 7:1 యిలా అంటుంది: "యెహోవా నలుదిక్కుల అతని శత్రువుల మీద అతనికి జయమిచ్చి అతనికి నెమ్మది కలుగజేసిన తరువాత." [37]దావీదు యొక్క మిగిలిన జీవిత కాలంలో ప్రధాన పాత్ర వహించిన నాతానును గూర్చి చదవడం యిదే తొలిసారి (2 సమూ. 12:1-14; 1 రాజులు 1). దావీదు తన కుమారులలో ఒకనికి "నాతాను" అను పేరు పెట్టాడు (2 సమూ. 5:14). [38]యెషయా 55:8; సామె. 14:12. [39]సాధారణంగా ఇశ్రాయేలు కొరకును, ప్రత్యేకించి దావీదు కొరకును దేవుడు ఏమి చేయగలడో దానిని దావీదునకు జ్ఞాపకం చేశాడు, భవిష్యత్తులో ఏమి చేస్తాడో తెలిపాడు. [40]1 రాజులు 5:3 గమనించు.

[41]"తలకాయ ఊపడం" అంటే "అవును" అని చెప్పడం. [42]"కొట్టివేశాడంటే," "లక్ష్యపెట్టలేదు," "తీసివేశాడని" అర్థం. ఈ ప్రతిపాదనలోని మొదటి బాగంలో మొదటి అర్థంతోను; రెండవ భాగంలో రెండో అర్థంతోను ఉపయోగింపబడింది. [43]1 దినవృ. 22:6-10, 28:6-10లోను దావీదు 2 సమూ. 7నుండి కోట్ చేసి, దానిని సొలొమోనుకు వర్తింపజేశాడు. [44]1 రాజులు 15:4. [45]లూకా 3:31ని కూడా చూడు. [46]దానియేలు 2:44; యెషయా 2:2-4; మార్కు 1:14, 15; మత్తయి 16:18, 19; మార్కు 9:1; యోహాను 18:36; లూకా 24:45-49; అపొ. 1:6-8; 2:1-4; హెబ్రీ. 12:28లను పోల్చి చూడు. [47]అపొ. 2:29-36; ప్రకటన 3:7. [48]1 కొరింథీ. 15:24-27ను; కొలస్సీ. 1:13తో పోల్చి చూడు.

[49]నాతానుతో దావీదు స్నేహితుడుగానా లేక ప్రవక్తగా మాట్లాడాడా? ప్రవక్తగా మాట్లాడి ఉంటే ఆ విషయంలో దేవుని చిత్తాన్ని విచారించి యుండవచ్చు. [50]1 దినవృ. 17:16 ప్రార్థనకు కూర్చుండడమనే రూపాన్ని బైబిల్లో సూచించేది యిక్కడే.

[51]1 దినవృ. 28:19ని పోల్చు. ప్రత్యక్ష గుడారంనుండి దేవాలయానికి నవీనం చేయబడిందంటే, నేడు కూడా నవీనం చేయవచ్చు అనడానికి ఒక రచయిత ఈ ఉదాహరణ వాడాడు. ప్రాముఖ్యమైన విషయమేమంటే నవీనం దేవునివలన చేయబడింది.